కమాటు ఆలోచిస్తే యీసామెతయొక్క నిజా నిజములు మనకే తెలుస్తవి.

---

# 'మువ్వంకాయ.'

పి. కుశాలరావు, బి. ఏ.,

ఏమండీ ! భోజనానికి లేవరూ ? చాలా వేళ యింది

........................

ఎన్నిసారులు పిలిచినా పలకరేమండీ? నాకు నిద్రకూడా వస్తోందండి.

నీకు నిద్రవస్తే నీవు భోజనము చెయ్యి.

మరి మీరో ?

నాకు భోజనమువద్దు యీవాళ.

ఎందుచేతనో యీవాళ సాయంత్రము స్కూలునుంచి వచ్చినప్పట్నుంచీ విచారంగా కూర్చున్నారు. వుద్యోగానికేమైనా మాటొచ్చిందేమిటండీ ?

మాటా లేదు, గీటాలేదు. వెధవకుర్రాళ్ళతో వేగిపోతున్నాను. మరోవూరు బదిలీ చేయించుకున్నా బాగుండును.

అదా సంగతి. బడికుర్రాళ్ళమూలాని ఊరు విడిచి పారిపోవాలటండి. 'బ్రిహచారి శత మర్కటవహః' అన్నారు. కుర్రాళ్ళ అల్లరితో మీకంత పట్టింపెందుకండీ ?

పట్టింపా ? వెధవలు ఏదో మువ్వంకాయట! ఏగోడమీద చూచినా మువ్వంకాయే, బడిలో గోడమీదా మువ్వంకాయే బ్లాకు బోర్డుమీద మువ్వంకాయే, ప్రతీవెధవ నోట్లోనూ మువ్వంకాయే, సర్వం మువ్వంకాయలాగే కనపడుతూందినాకు

మువ్వంకాయేమిటండీ ?

ఏమో వాళ్ళమొహం. ప్రపంచములో ఎన్ని రకాల వంకాయలు లేవు. మువ్వంకాయే దొరికిందీ వెధవలకి.

'మువ్వంకాయ' అని పిలవడానికి ఒక కారణము వుండొచ్చునండీ. సాధారణముగా మువ్వంకాయి కూరకి పొట్టొంకాయలే ఉపయోగిస్తారు. మీరు పొట్టిగా వున్నారని.

ఎంతపొట్టి వాళ్ళమొహం. మొన్న నేకాదూ నేను వ్రాసిన కథలో 'నేను పొట్టీకాదు, పొడవూకాదు, సామాన్యపు మనిషిని' అని వ్రాసుకున్నా.

వ్రాస్తేమాత్రం. మిమ్మల్ని చూచినవాళ్లు ఎవరు నమ్ముతారండీ మీవ్రాతలు ? మనిషికి సాధారణపు పొడవంటే ఐదునర అడుగులుండాలికదా? మీరు ఐదు అడుగులలోపై ఉన్నారు కదండీ మరి ?

ఐతే నీవుకూడా వాళ్ళలోదానివన్న మాటే, వకాల్తా పుచ్చుకున్న ప్లీడరులాగా అర్గ్యూ చేస్తున్నావు. నోరుముయ్యి.

కాదండీ మరి వాళ్లేదో అనుకుంటే అనుకున్నారని ఊరుకోకూడదండీ ? అలా అభిమానపడితే మరీ అంటారు. చూడండీ వీధిగోడలమీ

ద ఎన్నెన్ని రకాల వ్రాతలుంటాయో 'జిడ్డు, బక్కదెయ్యం, చైతక్కలబొమ్మ, (నవ్వుతూ) ఏదో ఆచారీ' అని ఎన్నెన్నో వ్రాస్తారు. అక్కతాయి కుర్రాళ్లు. వాళ్ళంతా మీలాగ అభిమాన పడుతున్నారా?

అభిమానమా? వెధవల్ని శేపట్నుంచి చీల్చేస్తాను చూడు.

అటువంటి పిచ్చిపనేమీ చేయకండి. మొన్న ఒకాయన యిలాగే కుర్రాళ్ళు పెట్టు పేరుతో పిలుస్తే తిట్టేడట. వాళ్ళాయన్ని నాలుగు వాయించేరట. ఆయన వాళ్ళమీద ఛార్జీ యిచ్చేడని కూడా విన్నాను కోర్టులో కూడా తనపేరు నలుగురికీ తెలియాలని ఆయన కోరికగావును. అటువంటి పనేమైనా చేసేరా మన మర్యాద దక్కదు. భోంచేద్దురుగాని లేవండి. యివ్వాళ ముద్దొంకాయ కూర చక్కగా వండేను.

## నా పేరు చెప్పుకోవాలి.

వై. జె. హెచ్. సత్యన్నారాయణ.

నేనంటే నేమిటి! నామహిమ—నాప్రభావము—ఒహో—నిజముగా సర్వాధికారం నా చేతిలోకే వచ్చేసింది. తెల్లవారింది లగాయితు ముప్పాతిక మూడువంతులు నా సేవ చేస్తూనే యుంటారు. యికను తెల్లవారేమిటి? రాత్రింబవల్లు నన్ను తలపెట్టనివారు లేరంటేనమ్మండి! ఎక్కడజూచినా నాస్వరూపమే! ఎక్కడచూచినా నాఅవతారమే! నా అవతారాలముందు యీదశావతారాలు సాటిరావు—నా చర్య అంతా చూస్తే మీకో అవతారపురుషుణ్ణిలా కనిపిస్తున్నా. అటువంటి ప్రభావము నావద్ద నుండబట్టే ఎక్కడ అవతరించమంటే అక్కడ అవతరిస్తా

నేనొకచోటనున్నాను—ఒకచోటలేను అనే సందేహము అక్కరలేదు. ఎక్కడచూచినా నా స్వరూపమే అనేక అవతారాలుక్రింద మారిపోతూంది—ఆమాటకువస్తే ఏకోర్టుల్లో చూచినా—ఏకోటలో చూచినా—ఏపేటలో చూచినా—ఏతోటలో చూచినా—ఏఆఫీసులో చూచినా—ఏస్కూల్లో చూచినా—ఏలాడ్జిలో చూచినా—ఏటేబిలుమీద చూచినా—ఏస్టూడెంటువద్ద చూచినా—ఏజంటిల్ మన్ వద్ద చూచినా—ఏమేడలో చూచినా—ఏదర్బారులో చూచినా—ఏరైలులో చూచినా—ఏబస్సులో చూచినా—ఏబండిలో చూచినా నేనే! ఐ యామ్ హియ్యర్, ఐ యామ్ దేర్, ఐ యాం ఎవ్విరివేర్. ఇన్ ఫాక్టు ఐ యాం ఆమ్నీప్రెజెంటు. నేను సర్వాంతర్యామి నన్నమాటే! ఒక విద్యావిషయములోనేకాని—ఒక కోర్టుదావావిషయములోనేకాని—ఒక అర్జీవిషయములోగాని నన్ను తలపెట్టనివారుండరంటే నమ్మండి! ఇకను వారేమిటి వీరేమిటి ముఖ్యముగా విద్యావంతుడైన తరువాత విధిగా నన్ను తలపెట్టితీరాలి. అలా నన్ను తలపెట్టకపోయారా వారిని ఎందుకు పనికిమాలిన వారిగా చేసేనన్నమాటే! అందుకు వేరే సందేహము లేదు